క్లుప్తంగా

ఎయిడ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలి



భీమడోలు వీధి నాటక ప్రదర్శిస్తున్న జానపద కళాకారుల బృందం

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలంటూ ఏలూరుకు చెందిన కీర్తన సాంస్కృతిక సొసైటీ కళాజాత బృందం ఆధ్వర్యంలో భీమడోలులో జానపద కళాకారులు వీధి నాటకలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం భీమడోలు బస్టాండ్, ఉన్నత పాఠశాల వద్ద ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాధి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వారు పాటలు, నాటక రూపంలో వివరించారు. కళాకారులు ఎం.కుమార్, ఎం.తిరుపతి, పి.రమేష్, రాజేష్, సాయి, వాణి పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి



యాచకులకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న విన్సెంట్ ది పాల్ సొసైటీ సభ్యులు

భీమడోలు: తోటి వారిపై ప్రేమానురాగాలను కలిగి ఉండాలని, ఇదే క్రైస్తవత్వమని ఫాదర్ షింటో అన్నారు. భీమడోలు ఆర్సీఎం చర్చి పరిధిలోని విన్సెంట్ ది పాల్ సొసైటీ ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు తపస్సు కాల దీక్షను చేపట్టారు. దీనిలోభాగంగా పేదలను, అన్నార్తులను ఆదుకోవాలని చాటిన సెయింట్ విన్సెంట్ ది పాల్‌ను ఆదర్శంగా తీసుకుని తపస్సుకాలంలో ధానధర్మాలు చేయాలని షింటో అన్నారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో 40 మంది యాచకులకు భోజన ప్యాకెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో న్యాయవాది రాజారావు, సభ్యులు కెనడీ, రమేష్, ఉదయ్, ఎం.శరీన్, సాల్మన్‌రాజు, వంశీ, ప్రభాకర్, వేణు, పాల్‌రాజు, కున్నీ, సందీప్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు కార్యక్రమాలు

గణపవరం: గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 19వ తేదీ సోమవారం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 9 గంటల నుంచి అర్ధవరంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. రూ.47 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. అప్పనపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, మల్లపరాజుపేటలో రూ.47 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, కేశవరంలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఎస్‌కొండేపాడులో రూ.47 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.60 లక్షలతో ఉండి పంట కాల్వ నుంచి మంచినీటి చెరువుకు నీరు నింపే పంప్‌హౌస్ పథకాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మొయ్యేరులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ షాపును ప్రారంభిస్తారు. సాయంత్రం గణపవరం కేవీపీ పంక్షన్ హాలులో గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొని రాబోయే ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేస్తారు.

ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారి ఓట్లు తొలగించాలి

దెందులూరు: ఇతర రాష్ట్రాల్లో స్థిరపడి ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కును కలిగి, ఓటు వేస్తున్న వారి ప్రతి ఒక్కరి ఓటును తక్షణమే తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ సామాన్యుడు జీవనం కోసం రెండు, మూడు నెల పాటు ఎక్కడికైనా వెళితే వెంటనే వారి ఓటును తొలగిస్తున్న ఎన్నికల అధికారులు ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటూ ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇళ్ల కలిగిన ఉన్నవారికి ఏపీలో ఎలా ఓటు హక్కు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. దీనిపై కమిషన్ స్పందించకుంటే న్యాయస్థానంలో సవాలు చేస్తామని అన్నారు.

135 మందికి కంటి పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 135 మంది కంటి పరీక్షలు చేశారు. 32 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసి మందులు ఉచితంగా అందజేశారు. 16 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి ఉచిత శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో పరసా శ్రీనివాసరావు, చెన్నా వెంకట్రామయ్య పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా 'ఈ-క్రాప్'

- చురుగ్గా సాగుతున్న పంటల నమోదు
- ఈనెల 22వ తేదీ వరకు గడువు పొడిగింపు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు భరోసా కేంద్రాలకు ఏర్పాటు చేసి విత్తనం మొదలుకుని పంట దిగుబడి చేతి కందే వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. విపత్తుల వేళ, అన్నదాతలకు నష్టం వాటిల్లితే సాయం అందించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోంది. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ఈ క్రాప్ పేరుతో పారదర్శకతకు పెద్ద పీట వేస్తోంది. రైతులు సాగు చేసిన పంట, వాటి విస్తీర్ణం వివరాలను ఆర్‌బీకే అసిస్టెంట్లు ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మూస పద్ధతిలో ఈ క్రాప్ నమోదు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాగూడదన్న లక్ష్యంతో ఈ క్రాప్ నమోదులో నూతన విధానాన్ని అమలు చేస్తోంది. వ్యవసాయంతో పాటు అనుబంధంగా ఉన్న పంటలను ఈ క్రాప్‌లో సంబంధిత సిబ్బంది వ్యవసాయ, ఉద్యానవన క్షేత్రాల వద్దకు వెళ్లి సర్వే నంబర్ల వారీగా పంట వివరాలను జియో ఫీ ఫెన్సింగ్ విధానంలో ప్రభుత్వం సూచించిన ప్రత్యేక విధానంలో నమోదు చేస్తున్నారు. రైతుల ఫొటోలు కూడా తీస్తున్నారు. భూమి సర్వే నంబర్లు, విస్తీర్ణం, రైతుల ఆధార్ కార్డుల నంబర్లు, బ్యాంకు పాస్ పుస్తకాల ఖాతాల నంబర్లు, సాగు చేసిన వంగడాల రకం తదితర వివరాలు ప్రభుత్వం ఇచ్చిన విధానంలో తప్పులు లేకుండా నమోదు చేస్తున్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండల పరిధిలోని వ్యవసాయం, ఉద్యానవన పంటలకు 90 శాతానికి పైగా నమోదు పూర్తయ్యింది.



దుద్దేపూడిలో వరి రైతు పంటను నమోదు చేస్తున్న వీఏఏ కొల్లి ఆదిత్య



అంబర్‌పేటలో ఉద్యానవన పంటను నమోదు చేస్తున్న హార్టీకల్చర్ అసిస్టెంట్

మండలం	పంట విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈకేవైసీ పూర్తి (ఎకరాల్లో)	మొత్తం రైతులు	ఈకేవైసీ చేసిన రైతులు
భీమడోలు	13,994	13,089	4,714	3,756
ద్వారకాతిరుమల	9,273	5,278	1,491	1,128
ఉంగుటూరు	24,953	22,897	8,735	5,518
నిడమర్రు	6,369	5,803	2,216	810

బహుళ ప్రయోజనాలు

పంట నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని అందించేందుకు ఈ క్రాప్ నమోదు దోహద పడుతుంది. పంటలకు బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాప్‌లో నమోదు కావాల్సి ఉంది. పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్ చేసి ఉండాలి. కౌలు రైతులకు గ్రామ సహాయకులు తన వివరాలను అందించే వాటిని నమోదు చేస్తారు. వచ్చే సార్వా సీజన్‌కు ఎరవులు, విత్తనాలు ఏ మేరకు అవసరమో నివేదికను సిద్ధం చేసుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. దీనితో పాటు పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసే నేపథ్యంలో ఆధార్‌తో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసుకోవాలన్నారు.

భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో

ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పక్కాగా సాగుతుంది. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో 54,589 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, చెరుకు, పామాయిల్ తదితర పంటలను రబీలో 17,156 మంది రైతులు సాగు చేస్తున్నారు. అత్యధికంగా ఉంగుటూరులోను, అత్యల్పంగా నిడమర్రుల్లో ఈ క్రాప్ నమోదు చేయాల్సి ఉంది.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



ఈ క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి రైతు తన పంటపై ఈ క్రాప్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలి. రబీ సీజన్‌లో ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు గడువును ప్రభుత్వం ఈనెల 22 వరకు పొడిగించింది. రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్, భూమికి సంబంధించిన వివరాలు, వీఏఏలకు ఆధార్ బేస్ డేటాను అనుసంధానం చేసి ఈ క్రాప్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియను ఏఈవోలు, ఏవోలు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రాప్ వల్ల కనీస మద్దతు ధరలకు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రాప్ విధానం వల్ల రైతులు మేలు జరుగుతుంది.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

మానవత విద్యానిధికి విరాళం

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు యువీ సత్యనారాయణ మానవత విద్యానిధికి రూ.25వేల విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ నగదును పెదపాడు మానవత శాఖ అధ్యక్షుడు కుకునూరి రామకృష్ణారావు (రాంబాబు)కు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనవాసరావు, శ్యామలరాజు, రామచంద్రరావు, శ్యామలరాజు పాల్గొన్నారు.

కేంద్రం విభజన హామీలు అమలు చేయాలి

ఏలూరు రూరల్: విభజన హామీలను విస్మరించి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీ, అనుకూల పార్టీలను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి, సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి ఎం కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. వామపక్ష, లౌకిక వాద పార్టీలను బలపరచాలని కోరుతూ ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని వెల్లడించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని, విభజన హామీలు అమలను కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సదస్సుకు లౌకిక పార్టీ నాయకులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: అచ్చుతాపురంలో సీతారామ లక్ష్మణ హనుమద్ విగ్రహాల ప్రతిష్ఠాపన, నూతన ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవం సర్పంచ్ మద్ది పాటి నాగమణి, పెద్దల సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయాన్ని రూ.18 లక్షలతో పునర్నిర్మించారు. ఉదయం 8:15 నిమిషాలకు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. 11 మంది దంపతులు తొలి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం నుంచి ఐదువేల మందికి పైగా భక్తులకు మహా అన్న సమారాధన నిర్వహించారు.

నేటి నుంచి శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం





అంబర్‌పేటలో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయం, ప్రతిష్ఠించనున్న శివలింగం

భీమడోలు: అంబర్‌పేటలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో ప్రజల కోరిక మేరకు పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చొరవ తీసుకున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆలయ అభివృద్ధికి సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్స్) నిధులను మంజూరు చేశారు. దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన రూ.30లక్షల నిధులతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయంలో సకల సౌకర్యాలను సమకూర్చి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 19న సోమవారం నుంచి 21వ తేదీ బుధవారం వరకు పునః ప్రతిష్ఠ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో ఎం.రాధ ఆదివారం తెలిపారు. ఆలయంలోని శివ పార్వతి, గణపతి, నాగబంధ, ఆంజనేయ స్వామి, నందీశ్వర, చండీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈనెల 21న తూర్పుగోదావరి జిల్లా అయినమిల్లి మండలం ముక్తీశ్వరం గ్రామానికి చెందిన టీటీడీ వేద పండితులు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని యాజ్ఞిక, రుత్విక బృందం ఆధ్వర్యంలో అర్చకులు ప్రతిష్ఠ మహోత్సవ పూజలు నిర్వహించనున్నారు.

దాతల సాయంతో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు

దెందులూరు: ఉండ్రాజవరంలో సున్నా డొకరబోగులు కృష్ణకుమారి జ్ఞాపకార్థం వరలక్ష్మి, కల్యాణి శ్మశాన వాటికలో మోటారు, బోరు ఏర్పాటు అలాగే సున్నా సూర్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు సున్నా వెంకట్రావు, సున్నా రాంబాబు, సున్నా సత్యనారాయణ, సున్నా నాగేశ్వరరావు, సున్నా రామాంజనేయులు వాటర్ ట్యాంకు, శ్మశాన స్నానఘట్టంను రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక సమీపంలో బోరు, వాటర్ ట్యాంకు, మోటారు, షెడ్డు విధిగా ఉండాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రోత్సాహంతో దాతలు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. అనంతరం వాటర్ ట్యాంకు, స్నానఘట్టం, మోటారు, బోరులను వరలక్ష్మి, కల్యాణి, దాతల కుటుంబ సభ్యులు ఎంపీటీసీ నరేష్‌తో కలిసి సర్పంచ్ ప్రారంభోత్సవం చేశారు.



ఉండ్రాజవరంలో బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్

వైభవంగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి



కూచిపూడి కళాకారులను సన్మానించిన ఉత్సవ కమిటీ



కోలాట నృత్య ప్రదర్శన



ఆలయ ఆవరణలో బారులు తీరిన భక్తులు

గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ అర్చకులు అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని పుష్పాలతో అలంకరించారు. వివిధ గ్రామాలనుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అవరణలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సోమ వారం అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు ప్రముఖ సినీ గాయని మంగ్లీ టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. - దెందులూరు

మహిళలు కేన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌ను దరిచేరకుండా జాగ్రత్త పడవచ్చని నగరానికి చెందిన హోటల్ ఎస్ గ్రూప్ అధినేత నారా శేషు సూచించారు. స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ధర్మభేరి ప్రాంగణంలో ఇన్నర్ వీల్ క్లబ్, హోటల్ ఎస్ గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ, మహిళలకు ట్రెజర్ హంట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రెజర్ హంట్ కార్యక్రమంలో పాల్గొని గెలిచిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.5000, రెండవ బహుమతిగా రూ.3000, మూడవ బహుమతిగా రూ.2000 అందించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గ అధ్యక్షురాలు పీడీసీ పీఎస్ లక్ష్మి, సెక్రటరీ జీ. అచ్యుత, కార్యవర్గ సభ్యులు, కేంద్ర పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు, ఇళ్ళ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శానం రామకృష్ణ, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

నిబంధనలకు విరుద్ధంగా వేట చేయరాదు

పోలవరం రూరల్: మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా వేట చేయరాదని స్థానిక మత్స్యశాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెకంటేశ్వరరావు హెచ్చరించారు. గోదావరి నదిలో పోలవరం, గూటాల ప్రాంతం పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధించిన వలలతో వేట చేయడంపై ఆయనకు ఫిర్యాదు అందడంతో ఆదివారం గోదావరి నది ప్రాంతంలో మత్స్యకారులు నివసించే ప్రాంతాలను పరిశీలించారు. మత్స్యకారులు గోదావరి నదిలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని నిషేధించిన ప్రాంతాల్లో వేట చేయరాదన్నారు. ఏటా ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా చేప పిల్లలను గోదావరి నదిలో విడుదల చేస్తుందన్నారు. చేపపిల్లలు పెరిగడం వల్ల మత్స్యకారులకు లబ్ధిచేకూరుతుందన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు

వలంటీర్లను గౌరవించడం అందరి బాధ్యత

- ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు అభినందనీయులు
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటూ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ సాయం అందిస్తున్న వలంటీర్ల సేవలను మరువరాదని, వారిని గౌరవించుకోవడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం ఉంగుటూరు మండలం నారాయణపురంలోని పొత్తూరి శ్రీనివాసరాజు ఐస్ పరిశ్రమ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు రాష్ట్రంలో వలంటీర్లు అందించిన సేవలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయన్నారు. ప్రతి నెల తెల్లవారక ముందే వలంటీర్లు వృద్ధులకు పింఛన్ అందజేసి వారి కళ్లలో ఆనందం చూడటం జరుగుతోందన్నారు. వలంటీర్ల కృషి కారణంగా సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సులువుగా ప్రజలకు చేరువ అవుతున్నాయని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 95 శాతం మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. వలంటీర్లు అవినీతి రహితంగా సంక్షేమ ఫలాలు అందజేశారని అన్నారు. అమోఘమైన సేవలందించిన వలంటీర్లను వాసుబాబు అభినందించారు. పేదల పక్షపాతిగా ఉన్న జగన్‌ను గెలిపించేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గ్రామాల్లో రేపటి నుంచి ఇంటింటికీ తిరగాలని వాసుబాబు కోరారు. సేవ వజ్రకు ఎంపికైన ఎ.గోకవరానికి చెందిన పెండెం దేవ మణిని, పేద్ద చంద్రనాగ అంజలి దేవిని శాలువా కప్పి సత్కరించారు. రూ.45 వేలు నగదు చెక్కును అందజేశారు. సేవా రత్నంకు ఎంపికైన కానుబోయిన వర్మ, కలిగట్ల ఆదిలక్ష్మి, పేడ్డలక్ష్మి, నూతులపాటి మాధురి, రంగు మానికా దేవిని వాసుబాబు సత్కరించి రూ.30 వేలు నగదు బహుమతి అందించారు. 462 మందికి రూ.15వేలు చొప్పున నగదు బహుమతితో పాటు శాలువా కప్పి సేవామిత్ర అవార్డుతో సత్కరించారు. ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, నాయకుడు బళ్ల త్రిమూర్తులు, ఎంపీడీవో శర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, సర్పంచులు, ఎంపీటీసీలు వేదికను అలంకరించారు. వలంటీర్లు నుంచి దారపురెడ్డి జ్యోతి, యు. మణికంఠతేజ, అనిత, వరలక్ష్మి, శిరీష, నాగరాజు సీఎం జగన్ పాలనను, ఎమ్మెల్యే వాసుబాబును ప్రశంసిస్తూ ప్రశంసిస్తూ మాట్లాడి ఆకట్టుకున్నారు.



సేవా వజ్రతో కైకరం వలంటీరు అంజలి దేవిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



హాజరైన వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు